ప్రైవేటుకు సింగరేణి అన్వేషణ విభాగం?

ఇప్పటికే బెల్లంపల్లి విభాగాన్ని మూసేసిన సంస్థ • 250 మంది సిబ్బంది భవిష్యత్తుపై నీలినీడలు

గోదావరిఖని, ఫిబ్రవరి 27: సింగరేణి సంస్థకు గుండెకాయగా చెప్పుకునే అన్వేషణ విభాగం ప్రైవేట్ వ్యక్తుల చేతిలోకి వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే బెల్లంపల్లి విభాగాన్ని మూసివేసిన సింగరేణి యాజమాన్యం.. రామగుండం విభాగంలో పనిచేసే కార్మికులకు పనులు లేవనే సాకుతో పర్మినెంట్ కార్మికులను తొలగించి మొత్తం అన్వేషణ విభాగాన్ని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు వేగంగా పావులు కదుపుతున్నట్లుగా తెలుస్తున్నది. ప్రస్తుతం రామగుండం విభాగం కిందనే భూపాలపల్లి ఏరియా అన్వేషణ విభాగం పనులు సాగుతున్నాయి. మొత్తం 150 మంది శాశ్వత కార్మికులు, 100 మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేసే ఈ డిపార్ట్మెంట్‌లో పనులు లేవని సాకుగా చూపుతున్నట్లుగా తెలుస్తుంది. సింగరేణిలో కొత్త గనులకు పర్యావరణ అటవీ అనుమతులు ఆలస్యం అవుతుండడం వల్లే వీరికి పనుల విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు కనిపిస్తున్నది. సింగరేణి తాడిచెర్ల బ్లాక్‌కు క్లియరెన్స్ వస్తే మరో మూడేండ్లపాటు వీరందరికీ పనులు ఉండే అవకాశం ఉంది. కానీ ఈ బ్లాక్‌కు ఇప్పట్లో అనుమతులు వచ్చే అవకాశాలు కనిపించకపోవడంతో ఈ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. కాంట్రాక్ట్ కార్మికులు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్, ప్రైవేట్ డ్రైవర్ల జీవితాలు రోడ్డున పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇటీవల బెల్లంపల్లి ఏరియాలో ఇవే పరిస్థితి అన్వేషణ విభాగాన్ని మూసివేయగా, పర్మినెంట్ కార్మికులను ఇతర విభాగాల్లోకి సర్దుబాటు చేశారు. మిగిలిన కొందరు కార్మికులను రామగుండం అన్వేషణ విభాగంలో విధులు కల్పించారు. అయితే ఇక్కడ డ్రిల్స్‌కి సరపడా కార్మికులు ఉండగా, బెల్లంపల్లి కార్మికులు అదనంగా ఉండిపోయారు. దీని పర్యావసానంగా కార్మికులకు రావాల్సిన పదోన్నతులు రాకుండా పోతున్నాయి. బెల్లంపల్లిలో పనిచేసిన అధికారులను బదిలీ చేసి ఒరిస్సాలోని నైనీ బ్లాక్, ఆ తర్వాత రామగుండం, కొత్తగూడెంలో సర్దుబాటు చేశారు. కార్మికులకు పదోన్నతులు కల్పించని యాజమాన్యం, అధికారులకు మాత్రం ప్రమోషన్లు ఇచ్చి అందలం ఎక్కిస్తున్నది. అధికారులకు అన్ని రకాలుగా ప్రయోజనాలను కల్పిస్తూ జీటీ ల్యాబ్, ఎస్‌పీటీ టెస్టుల పేరిట మరికొన్ని కొత్త పనులను సృష్టించి వారికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అధికారుల పదోన్నతులలో ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రతి మూడేండ్లకు పదోన్నతి లభించే విధంగా చేస్తున్నది. కొంత మంది పర్మినెంట్ కార్మికులు 15 ఏండ్లుగా పనిచేసినా ప్రమోషన్ రాకుండా పోతున్నది. ఇదంతా డిపార్టుమెంట్‌లో ఒక భాగమైతే, మరో వైపు కొత్త బ్లాక్‌ల కొరత ఎక్కువైంది.

రాష్ట్ర ప్రభుత్వం కొర్రీలు

ఇటీవల కాలంలో తాడిచెర్ల డ్రిల్లింగ్‌కు కేంద్రం అనుమతులు ఇవ్వగా, రాష్ట్ర ప్రభుత్వం అటవీశాఖ అధికారులు అనేక కొర్రీలు పెడుతూ కాలయాపన చేస్తున్నట్లు తెలిసింది. ఫలితంగా కార్మికులకు విధులు లేక కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు లేక 40 రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. ఇంత జరిగినా సింగరేణిలో కొత్త బ్లాక్‌ల కోసం అటవీ శాఖ అనుమతుల కోసం ముఖ్య పాత్ర పోషించే జియాలజీ విభాగం అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి అనుమతులు కోసం ప్రయత్నాలు చేయాలని, పనులు కల్పించేలా చూడాలని కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, ప్రైవేట్ డ్రైవర్స్, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు కోరుతున్నారు.

ఆలస్యంగా వచ్చిన బస్సులో ఎక్కుతున్న ప్రయాణికులు

సమయానికి బస్సులు రాక ఇక్కట్లు

- పని చేయని గమ్యం యాప్
- దృష్టి సారించాలని విజ్ఞప్తి

రామగిరి, ఫిబ్రవరి 27 : మంథని పెద్దపల్లి ప్రధాన రహదారిలోని బేగంపేట ఎక్స్ రోడ్ నిత్యం రాత్రి పగలు ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. సరైన సమయానికి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి రోడ్డు పక్కన నిల్చొని నిరీక్షించాల్సి వస్తున్నది. ముత్తారం, రామగిరి మండలాలకు బేగంపేట ఎక్స్‌రోడ్ ప్రధాన కేంద్రం కాగా ఇక్కడి నుంచి హైదరాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు మంథని డిపో నుంచి వచ్చే బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు. గత ఏడాది కంట్రోలర్ వ్యవస్థను తొలగించడంతో పాటు బస్సుల సంఖ్య కూడా తగ్గించారని ప్రయాణికులు చెబుతున్నారు. గమ్యం యాప్ కూడా సక్రమంగా పని చేయడం లేదని, నిర్ణీత సమయానికి రావాల్సిన బస్సు అప్పటికే స్టేజీ దాటిపోయినట్లు యాప్‌లో చూపిస్తున్నది. డిపో ఆధీనంలో ఉన్న బస్సులు రోడ్డు ఎక్కడం లేదు. అద్దె బస్సులు మాత్రమే నడుస్తుండంతో అన్ని రూట్లకు బస్సులు సరిపోవడం లేదని తెలిసింది. ఈ విషయంపై డిపో మేనేజర్‌ను వివరణ కోరగా పండుగ సందర్భంగా కాళేశ్వరం, వేలాల తదితర పుణ్య క్షేత్రాలకు వేశామని, బస్సులు నిర్ణీత సమయం ప్రకారం నడుస్తున్నాయని తెలిపారు.

పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్న ఓటర్లు

పోలింగ్ కేంద్రాల్లో అరకొర ఏర్పాట్లు

- గంటల తరబడి వేచి ఉన్న ఓటర్లు
- క్యూలైన్ సరిగ్గా నిర్వహించడం లేదంటూ పోలీసులతో వాగ్వాదం

మంథని: పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు

మంథని, ఫిబ్రవరి 27: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో అధికారులు అరకొర వసతులు ఏర్పాటు చేయడంపై ఓటర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంథనిలోని ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం రెండు పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు ఎక్కువగా ఉండడంతో అధికారులు ఓటర్లు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. దాదాపు 4 నుంచి 5 గంటల వరకు క్యూలో ఉండి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయా కేంద్రాల్లో నీడ కోసం టెంట్లు లేకపోవడం, తాగునీటి సదుపాయం కల్పించకపోవడంతో ఓటర్లంతా అసహనానికి గురయ్యారు. క్యూలైన్‌ను కూడా సక్రమంగా నిర్వహించడం లేదని ఓటర్లు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. స్త్రీ, పురుషులకు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తే ఇంత ఇబ్బంది ఉండేది కాదని పేర్కొన్నారు. సమయం ముగిసి పోయిన ప్పటికీ అప్పటికే సెంటర్‌లో ఉన్న వారికి ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. సాయంత్రం 5:15గంటల వరకు అధికారులు పోలింగ్ నిర్వహించడంతో ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

మంథనిలో..

మంథనిలోని ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. సాయంత్రం 5:15 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. సాయంత్రం 4 గంటల తరువాత కొంత మంది తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రం వద్ద కు రాగా, పోలీసులు వారిని అనుమతించలేదు. పోలింగ్ సరళిని గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్ పరిశీలించారు.

మంథని : పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

కాల్వశ్రీరాంపూర్: పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

- పట్టభద్రులకు 68.50 శాతం, ఉపాధ్యాయుల స్థానానికి 94.42శాతం పోలింగ్
- ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు మహేశ్ దత్ ఎక్కా

ఓదెల: పోలింగ్ కేంద్రం బారులు తీరిన ఓటర్లు

కమాన్‌పూర్ : పోలింగ్ కేంద్రం బారులు తీరిన ఓటర్లు

జ్యోతినగర్(రామగుండం), ఫిబ్రవరి 27: జిల్లా లో గురువారం జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి సభ్యుల ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల పరిశీలకులు మహేశ్ దత్ ఎక్కా పేర్కొన్నారు. రామగుండంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి సందర్శిం చారు. పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని 50 పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందన్నారు. కలెక్టరేట్ నుంచి కంట్రోల్ రూమ్ ద్వారా పోలింగ్ సరళిని ప్యవేక్షించినట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు జరిగిన గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో పురుషులు 13,098 మంది, మహిళలు 8,160 మొత్తం 21,259 మంది తమ ఓటు హక్కు వినియో గించుకు న్నారని పేర్కొన్నారు. పోలింగ్ 68.50శాతం నమోదైనట్లు వివరించారు. టీచర్స్ ఎన్నికల్లో పురుషులు 611మంది, మహిళలు 438 మంది మొత్తం 1,049మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని వెల్లడించారు. 94. 42శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. పోలింగ్ అనంతరం కరీంనగర్‌లోని రిసెప్షన్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్స్‌లను తరలించామని చెప్పారు. అంతకుముందు గోదావరిఖనిలోని సేక్రెడ్ హార్ట్ హైస్కూల్‌ని పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్, పెద్దపల్లి డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్, పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

పెద్దపల్లి, ఫిబ్రవరి 27: జిల్లాలో పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధి కారి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.

పాలకుర్తి, ఫిబ్రవరి27: పాలకుర్తి మండలం బసంత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్‌లో 68శాతం మంది ఓటుహక్కు వినియోగించుకు న్నారు. తహసీల్దార్ జ్యోతి, బసంత్ నగర్ ఎస్.ఐ. స్వామి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఓటింగ్ ఆలస్యం కావడంతో కేశోరాం ఉద్యోగులు, ఇతర ప్రైవేట్ ఉద్యోగులు అసహనానికి గురయ్యారు.

సుల్తానాబాద్ రూరల్, ఫిబ్రవరి 27: సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకుడు మహేశ్ దత్ ఎక్కా పరిశీలించారు. ఇక్కడ తహసీల్దార్ రామచందర్ రావు, అధికారులు ఉన్నారు.

రామగిరి, ఫిబ్రవరి 27 : రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు వేర్వేరుగా రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామని మండల ఎన్నికల అధికారి మధు సూదన్ రెడ్డి తెలిపారు. రామగిరి ఎస్సై చంద్రకుమార్ ఆధ్వ ర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయగా గోదావరిఖని టూటౌన్ సీఐ ఎన్ ప్రసాద్‌రావు పర్యవేక్షించారు.

ముత్తారం, ఫిబ్రవరి 27: మండలంలో మొత్తం పట్టభద్రుల ఓటర్లు 754కు గాను 584 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు 17 మంది 15 మంది ఓటు వేశారు. మంథని సీఐ రాజు బందోబస్తును పరిశీలించారు. తహసీల్దార్ మధు సూదన్ రెడ్డి. ఎంపీడీవో సురేశ్ పర్యవేక్ష్యించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు ఎస్ ఐ నరేశ్ బందోబస్తు నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి27: కాల్వశ్రీరాంపూర్‌లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు వేసేందుకు బారులు తీరారు. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ క్యూ కొనసాగింది. మొత్తం 76 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్‌రావు పర్యవేక్షించారు.

ఓదెల, ఫిబ్రవరి 27: ఓదెల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పట్టుభద్రులు, టీచర్లు ఓటు వేశారు. మొత్తం 72 శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. పొత్కపల్లి ఎస్ఐ రమేశ్ బందోబస్తు నిర్వహించారు. దివ్యాంగ ఓటర్లకు పోలీసులు సాయం అందించారు.

ధర్మారం,ఫిబ్రవరి27:ధర్మారం జడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని పట్టభద్రులు, టీచర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 1,330 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తహసీల్దార్ ఎండీ వకీల్ తెలిపారు. 97శాతం పోలింగ్ నమోదైనట్లు ఆయన వివరించారు. విప్,ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పోలింగ్ సరళిని కాంగ్రెస్ నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఎలిగేడు ఫిబ్రవరి 27: ఎలిగేడు జిల్లాపరిషత్ పాఠశాలలో 882 మంది పట్టభద్రుల ఓటర్లకు గాను 665మంది ఓటు వేశారు. టీచర్స్ ఎమ్మెల్సీకి 19 మందికి ఉండగా 13 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని తహసీల్దార్ బషిరోద్దీన్ తెలిపారు.ఇక్కడ పీఓ,ఏపీఓలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కమాన్ పూర్, ఫిబ్రవరి 27: మండలంలో మొత్తం పట్టభద్రుల ఓటర్లు 867 మంది ఉన్నారు. ఇందులో 679 మంది పట్ట భద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతం 78.31 గా నమోదైంది.

ప్రతి పోలింగ్ వద్ద బందోబస్తు : సీపీ

పోలీసులకు సూచనలు చేస్తున్న సీపీ శ్రీనివాస్

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 27: రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలోని 108 పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించినట్లు కమిషనర్ ఎం శ్రీనివాస్ తెలిపారు. రామగుండంలోని జడ్పీహెచ్ఎస్, గోదావరిఖనిలోని సేక్రెడ్‌హార్ట్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను సీపీ పరిశీలించి మాట్లాడారు. ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో మొత్తం 560మందితో బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు. ఇక్కడ అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ రాజు, స్పెషల్ బ్రాంచీ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ రమేశ్, సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ సంధ్యారాణి ఉన్నారు.

సిరా గుర్తు చూపుతున్న దాసరి మనోహర్ రెడ్డి కుటుంబ సభ్యులు, రాకేష్

ఓటు హక్కు వినియోగించుకున్న దాసరి

పెద్దపల్లి/పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి27: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించు కున్నారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి – పుష్పలత దంపతులు, పెద్దపల్లి మున్సిపల్ తాజా మాజీ చైర్ పర్సన్ దాసరి మమతారెడ్డి –ప్రశాంత్‌రెడ్డి దంపతులు, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ డాక్టర్ చిరుమిల్ల రాకేశ్‌కుమార్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

సుల్తానాబాద్ రూరల్ : పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న అధికారులు

ధర్మారం: ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో వచ్చిన దివ్యాంగుడు

జూలపల్లిలో ఉద్రిక్తత...

జూలపల్లి : నాయకులను సముదాయిస్తున్న సీఐ రవీందర్, ఎస్ఐ సనత్‌కుమార్

జూలపల్లి, ఫిబ్రవరి 27 : మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ఉద్రిక్తతకు దారి తీశాయి. బీజేపీ నాయకులు, పోలీసులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకున్నది. పోలింగ్ కేంద్రాల సమీపంలో కాంగ్రెస్ నాయకులు ఓటర్లకు చీటిల చాటున డబ్బులు పంచుతున్నారని సమాచారం ఇచ్చినా అడ్డుకోలేదని బీజేపీ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ నాయకుల నుంచి డబ్బులు ఎందుకు స్వాధీనం చేసుకోవడం ప్రశ్నించారు. ఒక దశలో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య మాటల యుద్ధం, తోపులాట జరిగి కొట్టుకునే పరిస్థితి వచ్చింది. ఇన్‌చార్జి సీఐ రవీందర్, ఎస్ఐ సనత్‌కుమార్, పోలీసులు వెంటనే ఇరువర్గాలను చెదరగొట్టారు. డబ్బుల పంపిణీ వ్యవహారంపై ఎన్నికల సంఘం కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కాగా జూలపల్లిలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో 69.02 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పీవో బషీరొద్దిన్ వెల్లడించారు.

పోలీసులతో బీజేపీ నాయకుల వాగ్వాదం

పాలకుర్తి, ఫిబ్రవరి 27 : బసంత్ నగర్ లోని పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ నాయకులు కండువాలు వేసుకుని ప్రచారం చేస్తున్నా పట్టించుకోవడం లేదని, బీజేపీ కార్యకర్తలను మాత్రం దూరంగా ఉంచడంపై ఆ పార్టీ నాయకులు కోమళ్ల ఆంజనేయులు, మహిళనాయకులు ఎస్ఐతో వాగ్వాదానికి దిగారు. పాలకుర్తి మండలంలోని పలు గ్రామాల నుంచి ఓటర్లను ప్రత్యేకవాహనాల్లో పోలింగ్ కేంద్రానికి తరలించారు.

రామగిరి : సిరా గుర్తు చూపుతున్న ఓటర్లు

ఓదెల : చంటిపిల్లలతో ఓటు వేయడానికి వచ్చిన యువతులు

ముత్తారం : పోలింగ్ కేంద్రంలో ఓటర్ల క్యూ

ఆలయ కమిటీ ఎన్నిక

ఆవుల రాజేశం

ధర్మారం, ఫిబ్రవరి 27: నంది మేడారంలోని శ్రీ అమరేశ్వర స్వామి ఆలయ కమిటీ ఎన్నికైంది. చైర్మన్‌గా ఆవుల రాజేశం,ప్రధాన కార్యదర్శిగా మానుపాటి శ్రీనివాస్,ఉపాధ్యాక్షులుగా దేవి కొమురేష్,ఆవుల అమరేందర్, కార్యదర్శులుగా మగ్గిడి తిరుపతి,మిట్ట సత్తయ్య, కొలిపాక ఉమాశంకర్,మందపల్లి శివరాజ్,కొక్కుల విద్యా సాగర్,ఎల్తూరి లచ్చయ్య,బరుపటి చిలుకయ్య, కోశాధికారిగా పంజాల శ్రీనివాస్,ప్రచార కార్యదర్శిగా కట్ట రమేశ్ ఎన్నికైనారు.

టిఫిన్ సెంటర్ల సిండికేట్‌పై చర్యలు తీసుకోవాలి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 27: రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో సిండికేట్‌గా మారిన టిఫిన్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ అధికారులను డిమాండ్ చేశారు. పారిశ్రామిక ప్రాంతంలో ఇటీవల కాలంలో వందల సంఖ్యలో టిఫిన్ సెంటర్లు వెలిశాయనీ, వినియోగదారులకు నిన్నటిదాకా అల్పాహారం ప్లేట్‌ను రూ.30కి విక్రయించిన నిర్వాహకులు సిండికేట్‌గా మారి రూ.40కి పెంచారని పేర్కొన్నారు. టిఫిన్ సెంటర్లలో ఎక్కడ కూడాశుభ్రత పాటించడం లేదని ఆరోపించారు. నగర పాలక సంస్థ అధికారులు టిఫిన్ సెంటర్లను తనిఖీలు చేయడమే మరిచిపోయారని పేర్కొన్నారు. ఆయా సెంటర్లలో వినియోగదారులకు నాసిరకం అల్పాహారాన్ని కూడా అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. నగరంలో ఎక్కడ పడితే అక్కడ, మురుగు కాలువల పక్కన అడ్డగోలుగా టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. నిర్వాహకులు ఎలాంటి జాగ్రత్తలు పాటించడం లేదని ఆరోపించారు. హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో అల్పాహారం విషయంలో ఎక్కడ కూడా నాణ్యత ప్రమాణాలు లేవన్నారు. వినియోగదారులకు అల్పాహారం అందించే ప్లేట్లను కూడా సక్రమంగా నీటిలో శుభ్రం చేయకుండా కంటి తుడుపుగా నీటిలో ముంచి ఆ తర్వాత అదే ప్లేటులో మరో వినియోగదారులకు ఇస్తున్నారనీ, దీనితో అంటువ్యాధులు కూడా ప్రబలే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు చందనాపూర్‌లో వైద్య శిబిరం

యైటింక్లయిన్ కాలనీ, ఫిబ్రవరి 27: సింగరేణి ఆర్జీ–2 ఆధ్వర్యంలో పకీల్‌పల్లి ప్రభావిత చందనాపూర్ గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆర్జీ–2 జీఎం వెంకటయ్య ప్రకటనలో తెలిపారు. గ్రామ ప్రజల సంక్షేమంను దృష్టిలో ఉంచుకొని నిష్ణాతులైన సింగరేణి వైద్యులచే ఈ శిబిరం ద్వారా ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గ్రామస్తులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేలాల జాతరకు తరలిన భక్తులు

మంథని/మంథని రూరల్, ఫిబ్రవరి 27: కోరిన కోరికెలు తీర్చే దేవుడిగా భక్తుల్లో చెరగని ముద్ర వేసుకున్న వేలాల మల్లన్న బోనాల జాతరకు గురువారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వెళ్లారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని వేలాల గ్రామంలో జరిగే మల్లన్న బోనాల జాతరకు మంథని పట్టణంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ప్రత్యేక వాహనాల్లో, ఆర్టీసీ బస్సుల్లో తరలి వెళ్లారు. మండలంలోని ఉప్పట్ల గ్రామ శివారులోని గోదావరి తీర ప్రాంతానికి అవతలి వైపే వేలాల గ్రామం ఉండడంతో పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లోని అన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు మంథని మీదుగా మండలంలోని సిరిపురం బ్యారేజీ రహదారి గుండా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాలీలు, ట్రాక్టర్లు, బస్సులు, కార్లతో ఎడ్లబండ్లలో అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.మహా శివరాత్రి సం దర్భంగా ఒక్క రోజు గుట్టపైన మరో రోజు గుట్ట కింద గ్రామమైన వేలాలో మల్లన్న బోనాల జాతర వేడుకలు వైభవంగా జరుగుతాయి. మల్లన్న బోనాల జాతరకు అధిక సంఖ్యలో తరలి వెళ్తుండడంతో మంథనిలో వాహనాల రద్దీ కనిపించింది.